





SINCE 2014

గురువారం ఫిబ్రవరి 27 2025 | సంపుటి :0 | సంచిక : 136 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



దిల్లీ: ప్రధాని మోదీ తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనను ప్రధానికి సీఎం వివరించారు. రాష్ట్రంలో చేపడుతున్న పలు ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ సాయం కోరారు. విభజన చట్టంలోని పెండింగ్ సమస్యలను ప్రధాని దృష్టికి సీఎం తీసుకెళ్లారు.
కేంద్ర బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి కేటాయింపులు లేవని మోదీకి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి అన్నివిధాలుగా చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. మూసీ నది ప్రక్షాళనకు సహకరించాలని.. చెరువుల పునరుద్ధరణకు ఆర్థికసాయం చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. పలువురు కేంద్రమంత్రులతోనూ నేడు సీఎం భేటీ అయ్యే అవకాశముంది.

## దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినం

- జ్యోతిర్లింగ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- ఉజ్జయినిలో సీఎం మోహన్ యాదవ్ దంపతుల పూజలు
- గోరఖ్‌పూర్‌లో యోగి ఆదిత్యానాథ్ ప్రత్యేక పూజలు



2లో

## విజయవాడ
### ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



2లో

## వేములవాడలో శివరాత్రి సందడి



- భారీగా తరలివచ్చిన భక్తజనం
- స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన బండి
- రాజన్న సేవలో ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచే రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కోడె మొక్కులు సమర్పించుకుని.. రాజన్న దర్శనం చేసుకున్నారు.

2లో

## గుడ్ న్యూస్.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా డబ్బులు అకౌంట్లో పడ్డయ్



ఉపాధి కూలీలకు మహాశివరాత్రి రోజు గుడ్ న్యూస్ . ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లో ఉపాధి కూలీలకు ఫిబ్రవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు జమ చేసింది. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. తరువాయి పేజి 2లో

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో
### కొనసాగుతోన్న సహాయక చర్యలు

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ)లో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



2లో

## శైవక్షేత్రాల్లో భక్తుల సందడి

- ప్రధాన ఆలయాలకు పోటెత్తిన జనం
- ప్రత్యేక పూజలు చేసిన కిషన్ రెడ్డి



మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగుతున్నాయి. శివుడిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాళేశ్వరం, వేములవాడ, కీసర తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేములవాడ రాజన్న క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మార్మోగిపోతోంది. భక్తులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి.. దర్శనానికి క్యూ లైన్లో బారులు తీరారు. తరువాయి పేజి 2లో

## పొట్లపల్లి శివాలయంలో మంత్రి పొన్నం పూజలు
### స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పణ



మహాశివరాత్రి సందర్భంగా జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీ స్వయంభూ రాజేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు ప్రజలు అందరూ క్షేమంగా ఉండాలని శివపార్వతులను కోరుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరత్వరగా క్యూ లైన్‌లలో దర్శనానికి పంపించాలని అధికారులకు సూచించారు. మంత్రి పొన్నం ఆలయంలోని భక్తులతో ముచ్చటించి.. అక్కడే ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌లో హెల్త్ చెకప్ చెపించుకున్నారు.దర్శనం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'పొట్లపల్లి స్వయం భూ రాజరాజేశ్వర స్వామి వారిని హుస్నాబాద్ ప్రాంతం వారే కాదు.. ఇతర జిల్లాల వారు కూడా పెద్ద ఎత్తున దర్శించుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా అధికారులు ముందే సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసుకొని అన్ని ఏర్పాట్లు చేశారు. భవిష్యత్తులో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. 20 సంవత్సరాలుగా పొట్లపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రతి శివరాత్రికి దర్శించుకుంటు న్నానని అన్నరు. ఈసారి ఆరెపల్లి నుండి పందిల్ల వరకు వయా పొట్లపల్లి మీదుగా డబుల్ రోడ్డు వేయించాం. భక్తులకు శాశ్వత డ్రింకింగ్ వాటర్ అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంతం అంతా ప్రాజెక్టులు పూర్తయి.. మంచి పంటలతో సుభిక్షంగా ఉంచాలని స్వామి వారిని వేడుకున్నానని తెలిపారు.

## తెలంగాణపై శంకరుడి కరుణాకటాక్షాలు ఉండాలి: కేసీఆర్

రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహా శివరాత్రి శు భాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు గరళకంఠుని దీవెనలు ఉండాలని ప్రార్థించారు.



2లో

## మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు: రేవంత్



హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

2లో

## సంపాదకీయం

# 'ఉక్కుచట్రం'కు అవినీతి తుప్పు!

'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా?' అన్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తలుచుకుంటే జరగనిది ఏమీ ఉండదని చెప్పవచ్చు. గత వారం ప్రధానమంత్రి తన కార్యాలయంలో రెండవ ప్రిన్సిపల్ సెక్రటరీగా శక్తికాంత దాస్‌ను నియమించారు. ఇలా ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండగా మరొకరిని అదే హోదాలో నియమించడం ఇదే మొదటిసారి. శక్తికాంత దాస్‌ను ప్రధానమంత్రి కార్యాలయంలో నియమించడంలో పెద్ద ఆశ్చర్యం లేదు. రిజర్వు బ్యాంకుకు స్వతంత్ర ప్రతిపత్తిని ఆశిస్తూ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన రఘురామరాజన్, ఊర్జిత్ పటేల్ వంటి ఆర్థిక వేత్తలు ఎక్కువ కాలం రిజర్వు బ్యాంకు గవర్నర్ పదవిలో కొనసాగలేకపోయిన తర్వాత ప్రవేశించిన శక్తికాంత దాస్ తన శక్తివంచన లేకుండా ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేసినందువల్లే ఆయన ఆరు సంవత్సరాలు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా కొనసాగగలిగారు. అంతకు ముందు ఫైనాన్స్ సెక్రటరీగా ఆయన పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కీలక నిర్ణయాలకు కారకుడయ్యారు. ఈ రెండు నిర్ణయాల వల్ల మాత్రమే కాదు, కోవిడ్ వల్ల కూడా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా ఆయనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. రిజర్వులను మళ్లించడం వంటి ప్రభుత్వ విధానాలపై పెద్దగా విభేదించకుండా, రిజర్వు బ్యాంకు బోర్డులో ఎవర్ని నియమిస్తున్నారన్న అంశాలపై దృష్టి కేంద్రీకరించకుండా జీడీపీ, ద్రవ్యోల్బణం, బ్యాంకులకు రుణాల ఎగవేత, నిరర్థక ఆస్థులు, భారీ ఎత్తున ప్రభుత్వ వ్యయం పెరగడం, పెరిగిపోతున్న ఆర్థిక లోటు మొదలైన అంశాలపై అంతగా ఆందోళన చెందకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ పడిపోతున్నా చెక్కుచెదరకుండా 'ఎప్పటికెయ్యది ప్రస్తుతం' అన్నధోరణిలో వ్యవహరించినందువల్లే శక్తికాంత దాస్ కేంద్రానికి అత్యంత సన్నిహితుడు అయ్యారు. ఐఏఎస్ అధికారుల్లో 'నొప్పించి తానొవ్వక' అన్నట్లు ప్రభుత్వ ఆలోచనా విధానానికి అనుగుణంగా పనిచేసినవారే విజయవంతం కాగలుగుతారు. అలాంటి వారిలో శక్తికాంత దాస్ ఒకరని చెప్పక తప్పదు. ఇప్పుడు ఆయన ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలకు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేస్తారనడంలో సందేహంలేదు.

శక్తికాంత దాస్‌కు ముందు రిజర్వు బ్యాంకు గవర్నర్‌లుగా ఉన్న వై.వేణుగోపాల్ రెడ్డి, దువ్వూరి సుబ్బారావు, రఘురామరాజన్, ఊర్జిత్ పటేల్ బ్యాంకు స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడేందుకు తీవ్ర యత్నాలు చేశారు. పెద్ద నోట్ల రద్దు గురించి పార్లమెంటరీ కమిటీలో చర్చకు వచ్చినప్పుడు 'ఈ నిర్ణయం గురించి మీతో ప్రభుత్వం చర్చించిందా?' అని ఆ కమిటీ చైర్మన్‌గా ఉన్న కాంగ్రెస్ ఎంపీ వీరప్ప మొయిలీ ఊర్జిత్ పటేల్‌ను ప్రశ్నించారు. ఊర్జిత్ పటేల్ జవాబివ్వకముందే ఆ కమిటీలో సభ్యుడుగా ఉన్నమాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జోక్యం చేసుకుని 'ఈ ప్రశ్నకు మీరు సమాధానమివ్వనక్కర్లేదు' అని స్పష్టంగా చెప్పారు. తాను ఒక సంస్థగా రిజర్వు బ్యాంకు ప్రతిష్టను కాపాడేందుకే అలా చేశానని మన్మోహన్ సింగ్ వివరించారు. మన్మోహన్ సింగ్ కూడా ఒకప్పుడు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా ఉన్నందువల్ల సంస్థ పరువు కాపాడాలని భావించారు. కాని సంస్థల పరువు ప్రతిష్ఠల గురించి ఇప్పుడెవరు పట్టించుకుంటారు?

ఎన్నికల రాజకీయాలకు అనుగుణంగా చర్యలు తీసుకునే ప్రభుత్వాధినేతలు ఉన్నంతవరకూ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థికవేత్తలతో పని ఉండదు. ఆర్థికవేత్తలు ఆర్థిక సుస్థిరత గురించి ఆలోచిస్తారు. రిజర్వు బ్యాంకు సంస్థాగత స్వతంత్రత కోల్పోయిందని ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వు బ్యాంకు మాజీ చైర్మన్ యాగా వేణుగోపాల్‌రెడ్డి ఒక సందర్భంలో ఆవేదన వ్యక్తపరిచారు. స్వతంత్రత అంటే ప్రభుత్వం నుంచి స్వతంత్రత కాదని, ప్రభుత్వ వ్యవస్థల్లో భాగంగా స్వతంత్రంగా వ్యవహరించాలనే నెహ్రూ నిర్వచనాన్ని అంగీకరించిన వేణుగోపాల్‌రెడ్డి ప్రపంచమంతా బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొన్నా భారతదేశంలో పెద్దగా సమస్యలు లేకుండా చూశారు. రికార్డు స్థాయిలో మూడేళ్ల పాటు 9.5 శాతం జీడీపీని సాధించారు. ద్రవ్యోల్బణం 4.4 శాతం నుంచి 6.6 శాతం మధ్య ఉండేలా చూశారు.' అమెరికా సెంట్రల్ బ్యాంకుకు కూడా ఇలాంటి అధినేత ఉంటే మా ఆర్థిక వ్యవస్థ ఇంత గందరగోళంగా ఉండేది కాదు' అని ఆ దేశ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిజ్ సైతం వేణుగోపాల్‌రెడ్డిని ప్రశంసించారు. చిదంబరం, అరుణ్ జైట్లీ లాంటి వారితో కూడా స్పష్టంగా విభేదిస్తూ ఏది సరైనదో చెప్పగలిగిన వేణుగోపాల్‌రెడ్డి లాంటి ఐఏఎస్ అధికారులు చాలా అరుదుగా కనిపిస్తారు.

నిజానికి తమతో విభేదించినా అధికారులు సరైన విధంగా సలహా ఇస్తే స్వీకరించే ఉదాత్త వ్యక్తిత్వం గల నాయకులు కూడా రోజురోజుకూ తక్కువైపోతున్నారు. అంజయ్య హయాంలో సెక్రటరీగా ఉన్న యుబి రాఘవేంద్రరావుతో సమర్థులైన బృందాన్ని ఎన్టీఆర్ విశ్వాసంలోకి తీసుకుని తన ఆలోచనా విధానాలకు అనుగుణంగా పనిచేయించుకున్నారు. అధికారులు కూడా నిర్భయంగా ఆయన వద్ద తమ ఆలోచనలను పంచుకునేవారు. ఒక సమావేశంలో ఎన్టీఆర్ భారీ వార్షిక ప్రణాళిక కావాలనుకున్నారు. అందుకు అదనపు పన్నులు విధించాల్సి ఉంటుందని ప్రణాళికా బోర్డు డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న విఠల్ చెప్పారట. ఎన్టీఆర్ అందుకు అంగీకరించలేదు. విఠల్ చేసిన సూచనలేవీ ఎన్టీఆర్‌కు నచ్చలేదు. 'విఠల్ గారూ, మీరు ప్రతిభాశాలి. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఆర్థిక నిపుణులు. మీరు కొత్త ఆలోచనలేవీ చెప్పలేరా.. లేదా ఎవరినైనా మంచి ఆలోచనలు చెప్పేవారిని సూచించండి' అని ఎన్టీఆర్ అడిగారు. 'అలా ఒక్కరే చేయగలరు..' అని విఠల్ అన్నారు. 'ఎవరాయన?' అని ఎన్టీఆర్ ఆశ్చర్యంతో అడిగారు. 'మీ వెనుకే ఉన్నారు చూడండి' అని అనేసరికి ఎన్టీఆర్ వెనక్కి తిరిగి చూశారట. వెనక గోడకు పటంలో వేంకటేశ్వరస్వామి మందహాసం చేస్తూ కనిపించారు! అలా ప్రధానమంత్రికి గానీ, ముఖ్యమంత్రులకు గానీ స్వేచ్ఛగా చెప్పగలిగిన అధికారులు ఎవరైనా ఉన్నారా?

# వేములవాడలో శివరాత్రి సందడి

మొదటిపేజీ తరువాయి

శివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయాన్ని కేంద్ర హోంశాఖ సహయ మంత్రి బండి సంజయ్ సందర్శించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. రాజన్న దర్శనం అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ 'మహా శివరాత్రి సందర్భంగా రాజన్నను దర్శనం చేసుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. దక్షిణ కాశీగా పిలువబడే రాజన్న ఆలయానికి వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి కూడా భక్తులు వస్తున్నారు. రాజన్న ఆలయం మోస్ట్ పవర్ ఫుల్. దేశ ప్రధాని వేములవాడ రాజన్నను దర్శనం చేసుకున్నారు. అప్పటి నుండి దేశ వ్యాప్తంగా ఒక చర్చ కొనసాగుతుంది. ప్రధాని దర్శనం నుండి దేశ ప్రజలు కూడా వేములవాడకి వెళ్లానుకుంటు న్నారు. మహాశివరాత్రి ఏర్పాట్లు చాలా బాగున్నాయి. ఈఓ, సిబ్బంది, సేవ సంస్థలను అభినందిస్తు న్నాను. ఇదే స్ఫూర్తితో చివరివరకు భక్తులకు సౌకర్యాలు కొనసాగించాలని సూచించారు. వేములవాడ రాజన్న ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. భక్తులు ప్రధాన ఆలయంలో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోంది. దాంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అర్ధరాత్రి నుంచే క్యూలో 6 గంటల పాటు వేచి ఉన్నప్పటికీ

దర్శనం కాలేదని, ప్రధాన ఆలయంలోకి అనుమతించలేదని కొందరు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న దర్శనం కాకుండానే శిఖర దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. వీఐపీలు, అధికారులు అధిక సంఖ్యలో బంధువులకు నేరుగా దర్శనం చేయిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారికి దర్శనం కోసం భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనాలను అందించారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇవో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

మొదటిపేజీ తరువాయి

విజయవాడ, మహాశివరాత్రి సందర్భంగా పలు శైవక్షేత్రాలు శివ భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తులతో శివాలయాలు కిటకిటలాడుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గమ్మవారి

సమీపంలోని భవాని జల శివాలయంలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే కృష్ణా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. యనమలకుదురు శివాలయంలో తెల్లవారుజాము నుంచి గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. మహాశివరాత్రి సందర్భంగా యనమలకుదురు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గ్రామంలోకి ద్విచక్ర వాహనాలు మినహా ఎటువంటి వాహనాలను పోలీసులు అనుమతించడం లేదు. ఇంద్రకీలాద్రిపై భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం, వన్ టౌన్ పాత శివాలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# తెలంగాణపై శంకరుడి కరుణాకటాక్షాలు ఉండాలి: కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

పవిత్ర శివరాత్రి సందర్భంగా శివ భక్తులు ఉపవాస దీక్షను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించడం హిందూ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకుందని కేసీఆర్ అన్నారు. దేశ వ్యాప్తంగా శివాలయాలు, భక్తుల శివనామస్మరణతో మారుమోగుతాయని అన్నారు. గరళాన్ని తన కంఠంలో దాసుకుని ముల్లోకాలను కాపాడుతున్న ఆ ఉమా శంకరుని కరుణాకటాక్షాలు తెలంగాణ ప్రజలకుండాలని ఆకాంక్షించారు. సుఖ శాంతులతో జీవించేలా ప్రజలందరినీ దీవించాలని కేసీఆర్ ఆ మహాశివున్ని ప్రార్థించారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతోన్న సహాయక చర్యలు

మొదటిపేజీ తరువాయి

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ)లో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తూ.. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. సొరంగంలో సుమారు 7 నుంచి 9 మీటర్ల ఎత్తున మట్టి పేరుకుపోయింది. ప్రధాన అడ్డంకిగా ఉన్న చివరి 40 మీటర్లలో నీరు ప్రవహిస్తోంది. పూడుకున్న మట్టి తీస్తే తప్ప టీబీఎం ముందు భాగానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.


సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు బుధవారం ఆపరేషన్ మార్కోస్ చేపట్టనున్నారు. ఇందుకోసం నేల, నీరు, ఆకాశం... ఎక్కడైనా, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా సహాయక చర్యలకు దిగే సత్తా ఉన్న ఇండియన్ మెరైన్ కమాండో ఫోర్స్ రంగంలోకి దిగనుంది. దీని సభ్యులనే మార్కోస్‌గా పిలుస్తారు. మార్కోస్‌తో బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్(బీఆర్‌వో) భాగస్వామ్యం పంచుకోనుంది.

# మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు: రేవంత్

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ అంశాలపై స్పందించారు. ప్రధానితో భేటీ సందర్భంగా 5 ప్రధాన అంశాలపై విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్ కమ్ రైలు ప్రాజెక్టు, డ్రైపోర్టు, రక్షణరంగ ప్రాజెక్టులకు సహకరించాలని కోరినట్టు తెలిపారు.

"కాళేశ్వరంపై పిటిషన్ వేసిన రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. కేసు వాదించిన సంజీవరెడ్డి అనుమానాస్పదంగా మృతి చెందారు. కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ దుబాయ్‌లో అనుమానాస్పదంగా చనిపోయారు. ర్యాడిసన్ బ్లూ డ్రగ్స్ కేసులో కేదార్ కీలక నిందితుడు. ఈ అనుమానాస్పద మరణాలపై కేటీఆర్ ఎందుకు స్పందించట్లేదు? జ్యుడిషియల్ విచారణ ఎందుకు కోరట్లేదు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల అక్రమాలపై సాంకేతిక నివేదికలు రాకుండా ప్రస్తుతం ఏమీ మాట్లాడను. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల్లో ఉన్న వారిని తీసురావాల్సిన బాధ్యత ఎవరిది? త్వరలో డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోంది. రాష్ట్ర విజ్ఞప్తులు ఐదింటికి కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం. కేబినెట్ ఆమోదం తేవాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే. మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. కేంద్రానికి విజ్ఞప్తి చేసిన ఐదు ప్రాజెక్టులు సాధిస్తే కిషన్‌రెడ్డికి



గండపెండేరం తొడుగుతా"

"పదేళ్లుగా ఎస్ఎల్‌బీసీ పనులు జరగలేదు. కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ పనులు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పనులు మళ్లీ మొదలయ్యాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు యత్నిస్తున్నాం. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ వద్ద 11 సంస్థలు పనిచేస్తున్నాయి. సొరంగం వద్ద జరిగింది ప్రమాదం. కాళేశ్వరంలో జరిగింది డిజైన్, నిర్మాణ లోపంతో జరిగిన దుర్ఘటన. హైదరాబాద్‌కు మెట్రో రావడానికి ప్రధాన కారకుడు జైపాల్‌రెడ్డి. కేసీఆర్ వచ్చాక మెట్రో కోసం చేసిందేమీ లేదు. మెట్రో విస్తరణపై కేసీఆర్ పదేళ్లు తాత్సారం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీకి రూ.22,500 కోట్లు అవసరం. ప్రస్తుతం ఆదాయం రూ.18,500 కోట్లు మాత్రమే ఉంది. జీతాలకు రూ.6,500 కోట్లు, వడ్డీలకు రూ.6,800 కోట్లు చెల్లిస్తున్నాం. ఆదాయం రూ.22వేల కోట్లకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం" అని సీఎం వివరించారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా డబ్బులు అకౌంట్లో పడ్డయ్

మొదటిపేజీ తరువాయి

ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో నిధులు జమ చేసింది ప్రభుత్వం. మొత్తం 18,180 మందికి 6 వేల చొప్పున జమ చేసింది. ఆ తర్వాత మండలి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు బ్రేక్ పడింది.అయితే ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని మంత్రి సీతక్కవిజ్ఞప్తి చేసింది. దీంతో ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేసింది. ఆ రెండు జిల్లాల్లో 66,240 మంది ఉపాధి కూలీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించిన ప్రభుత్వం. 66,240 మంది కూలీల ఖాతాల్లో 39.74 కోట్లు జమ చేసింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు 50.65 కోట్లు చెల్లించింది ప్రభుత్వం . ఎన్నికల కోడ్ ముగియగానే మిగతా జిల్లాల్లో లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించనుంది ప్రభుత్వం

దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఉపాధి కూలీలకు ఆర్దిక చేయుత కల్పిస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రవేశపెట్టింది తెలంగాణ ప్రభుత్వం. ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇవ్వనుంది. ఒక సీజన్ కు 6000 రూపాయలు చొప్పున కూలీలకు భరోసా కల్పిస్తోంది. డిబిటి పద్ధతిలో ఉపాధి కూలీల ఖాతాల్లోకి నేరుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను జమ చేస్తుంది ప్రభుత్వం.

# శైవక్షేత్రాల్లో భక్తుల సందడి

మొదటిపేజీ తరువాయి

స్వామివారి దర్శనానికి ఆరు గంటల సమయం పడుతోంది. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి అద్దాల మండపంలో అనువంశిక అర్చకులచే మహాలింగార్చన కార్యక్రమం ఉంటుంది. రాత్రి లింగోద్భవ సమయంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం జరగనుంది. కాళేశ్వరం క్షేత్రంలో మహాశివరాత్రి శోభ కనిపిస్తోంది. తెలంగాణతో పాటు పొరుగున ఉన్న మహరాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుండి భక్తులు కాళేశ్వరంకు తరలివస్తున్నారు. త్రివేణి సంగమ గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించి.. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మారేడు దళాలు సమర్పించి.. అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4.35కు వైభవంగా శ్రీ శుభానంద ముక్తీశ్వర స్వామి కల్యాణోత్సవం జరగనుంది. రాత్రి 12కు లింగోద్భవ పూజ జరగనుంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మహా శివరాత్రి పర్వదినం కావడంతో శ్రీశైలంకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. సాయంకాలం శ్రీస్వామి అమ్మవార్లకు నంది వాహనసేవ, ఆలయ ఉత్సవం ఉంటుంది. రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీస్వామివారికి పాగలంకరణ.. రాత్రి 12 గంటలకు పార్వతి పరమేశ్వరుల మహాశివరాత్రి బ్రహ్మోత్సవ కళ్యాణం జరగనుంది. మహానంది క్షేత్రంలో నేడు రాత్రి 10 గంటలకు లింగోద్భవ సమయంలో మహా రుద్రాభిషేకం, స్వామివారి కళ్యాణోత్సవం జరగనుంది.

# దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినం

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు మహా వేడుకగా జరుపుకున్నారు. దేశంలోని అన్ని శైవాలయాలు, జ్యోతిర్లింగాలు.. శివ భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

వారణాసి, ఉజ్జయిని, సోమ్‌నాథ్ వంటి ప్రధాన శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోరక్‌పూర్‌లో సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దంపతులు ఉజ్జయినిలోని మహాకాలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు చేశారు. ఆ ఆలయంలో ఇవాళ తెల్లవారుజామున భస్మహారతి నిర్వహించారు. ఆ తర్వాత మహాకాలుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారణాసిలోని కాశీ విశ్వనాథుడికి ఇవాళ ఉదయం ప్రత్యేక హారతి ఇచ్చారు. కాశీలో వేల సంఖ్యలో భక్తులు విశ్వనాథుడి దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు అయిదు కిలోమీటర్ల మేర అక్కడ భక్తులు క్యూ కట్టనట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఢిల్లీలోని గౌరీశంకర్ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. హరిద్వార్‌లోని ధాకేశ్వర్ మహాదేవ్ ఆలయం వద్ద భక్తులు భారీ క్యూలైన్ కట్టారు. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో త్రినేత్రుడి దర్శనం చేసుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు లక్షల సంఖ్యలో హాజరయ్యారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో ఉన్న జ్యోతిర్లింగ క్షేత్రమైన బాబా బైద్యనాథ్ ఆలయంలో కూడా భక్తులు కిటకిటలాడిపోయారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న అలువ మహాదేవ్ ఆలయానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గుజారాత్ లోని సోమ్‌నాథ్ ఆలయంలో వేకువజాము నుంచే అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. రామేశ్వరంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సముద్రస్నానాలు ఆచరించి శివుడి దర్శనం చేసుకు న్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న శివాలయాల్లో వేకువ జామునుంచే భక్తుల రద్దీ పెరిగింది. శ్రీకాళహస్తిలోని శివాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో ఆలయ దర్శనం కోసం వస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెల్లవారుజామున హనుమకొండ లోని వెయ్యి స్తంభాల గుడిలో పూజలు నిర్వహించారు. గ్వాలియర్‌లో ఉన్న అచలేశ్వర్ ఆలయంలో కూడా భక్తులు పెద్దగా ఎత్తున దర్శనాలు చేసుకున్నారు. ఏపీలోని శ్రీశైలంలో కూడా భారీగా పూజలు నిర్వహించారు.

# ఒక పార్టీ అధికారంలోకి వస్తే వానపాములన్నీ.. నాగు పాములవుతాయా

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**




తెలంగాణాలో రాష్ట్ర ప్రభుత్వం మారింది.ప్రభుత్వాలు మారడం సహజం.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్,తెలుగుదేశం పార్టీల పాలన సాగింది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కాంగ్రెస్ పార్టీ అధికారం కొనసాగింది.తెలంగాణ ఏర్పడ్డాక తెలంగాణ రాష్ట్ర సమితి కి పాలనా పగ్గాలు దక్కాయి. అప్పటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయాక కాంగ్రెస్ శ్రేణులు అసహనానికి గురయ్యాయి. కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని ఎంత బలహీనం చెయ్యాలో అంతా చేసారు. కేసీఆర్ నాయకత్వం తెలంగాణాకు ఒక దిక్సూచిగా కనిపించేది. కానీ కుటుంబ పాలన అనే ముద్ర పడి ప్రజల్లో టీఆర్ఎస్ పట్ల కొంత అసంతృప్తి ఏర్పడిన మాట వాస్తవం.దానికి తోడు కింది స్థాయిలో క్యాడర్ కు నాయకత్వం తగిన సహకారం అందలేదని క్యాడర్ భాధపడ్డ విషయం బహిరంగ రహస్యం. దీనితో క్యాడర్ నిరాశకు లోనైన విషయం కూడా స్పష్టం. వెలమ సామాజిక వర్గం బలంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో బిఆర్ఎస్ గా మారిన టీఆర్ఎస్ పట్ల స్వల్ప వ్యతిరేకత ఎదురైన విషయం విస్మరించ వీలులేనిది.కుటుంబ పాలన, కుల ఆధిపత్యం అనే రెండు విషయాలు కేసీఆర్ కు అంటిన మలినం.ఇక కాళేశ్వరం మొదలగు ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని జరిగిన ప్రచారాన్ని తిప్పికొట్టడంలో పార్టీ సరైన తీరు కనపర్చలేదన్న విషయం కూడా నిజం. కాకపోతే క్రింది స్థాయి పార్టీ క్యాడర్ ఉద్యమ స్ఫూర్తితో అంకిత భావంతో పనిచేసిన విషయం అందరికీ తెలిసిందే.ఒక నాయకుడిగా, ప్రత్యేక రాష్ట్ర సాధకుడిగా కేసీఆర్ కు ఉన్న పేరు ఎవ్వరూ తుడిచి వేయలేనిది.కేసీఆర్ సమర్థ పాలన కూడా జనం మెచ్చిన విషయం అన్నది కూడా అంతే నిజం.కేసీఆర్ ఒక్కడే అన్నీ తానై పార్టీని నడిపాడు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను చాటాడు.పై స్థాయిలో బి.ఆర్.ఎస్ నాయకత్వంపై ఏమైనా ఆరోపణలు ఉంటే ఉండవచ్చు కానీ, గ్రౌండ్ లెవల్ లో బి.ఆర్.ఎస్ కార్యకర్తలు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించిన విషయం కూడా అందరూ గమనించాల్సిన విషయం.పార్టీకి కార్యకర్తలే ఆధారం.కార్యకర్తల వ్యవహార శైలి, ప్రజా సంబంధాలు మాత్రమే పార్టీ ఉనికిని కాపాడతాయి.10 సం.ల కేసీఆర్ పాలనతో అప్పుడప్పుడే పార్టీ కార్యకర్తలు,నాయకులు ఒక స్వంత పాలనా శైలి రూపుదిద్దుకుంటున్న సమయంలో ప్రజా అసంతృప్తి మొదలయ్యింది. ఈ పరిస్థితికి కార్యకర్తలు మాత్రం కారణం కాదు.బి.ఆర్.ఎస్ పై, నాయకత్వంపై యాంటీ ఇన్ కంబెన్సీ మొదలుకావడానికి కార్యకర్తలు ఎంత మాత్రం కారణం కాదన్నది నిజం.ఆ సమయంలో బిజెపి కాంగ్రెస్ బి,ఆర్.ఎస్ కుటుంబ పాలన,కుంభకోణాల అంశాలు అంటూ దాడులు తీవ్రం చేసారు.బి.ఆర్.ఎస్ వ్యతిరేక ఓటు బిజెపి కాంగ్రెస్ మధ్యన చీలిపోయి మళ్ళీ బి.ఆర్.ఎస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని రాజకీయ పరిశీలకులు కూడా భావించారు కేసీఆర్ కేంద్ర వ్యతిరేక ధోరణి పట్ల బిజెపి కోపం పెంచుకున్నది. కేసీఆర్ కు అతని కుటుంబానికి తల నిండా అహంకారం నిండిందని బిజెపి తో పాటు అందరూ భావించారు.ఆ స్థితిలో బిజెపి ఆత్మ సమర్పణ చేసుకుని ఎన్నికల యుద్ధ రంగం నుండి మెల్లగా వెనక్కు జరిగి కాంగ్రెస్ విజయానికి తోడ్పడింది.బి.ఆర్.ఎస్ గెలవకూడదని,కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కాకూడదని బిజెపి నిర్ణయం తీసుకున్నది.కాబట్టి బి.ఆర్.ఎస్ వ్యతిరేక ఓటు చీలకూడదని బిజెపి భావించింది.కేసీఆర్, బి.ఆర్.ఎస్ పార్టీ, ద్రవిడ పార్టీల మాదిరిగా కేంద్ర వ్యతిరేక వైఖరి అనుసరించి లాభపడాలన్న వ్యూహంతో పనిచేసింది.బి.ఆర్.ఎస్ వ్యూహం గమనించిన మోడీ నాయకత్వంలోని బిజెపి.. కేసీఆర్, బి.ఆర్.ఎస్ పార్టీ ఓటమి ముఖ్యమని భావించి ఎన్నికల పోటీలో వెనక్కు జరిగింది. కాంగ్రెస్ కు సైడ్ ఇచ్చింది. దీనితో కాంగ్రెస్ లాభపడింది. దానితో తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది.అప్పటికే అధికారం కొరకు ఆవురావురుమంటున్న కాంగ్రెస్ పార్టీకి, కోరుకున్న అధికారం దక్కింది.ఇక ఇప్పుడు కాంగ్రెస్ కూడా తన పాత వైఖరితోనే పాలన కొనసాగిస్తున్నది.అధికారం కొరకు ఆవురావురు మంటూ ఎదురుచూసిన కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు భాధ్యత లేని రాజకీయాలు మళ్ళీ ప్రారంభించారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.పై స్థాయిలో జరిగే పాలనా రీతి గాని, రహస్య అవినీతి గాని ప్రజలకు అర్థం కాదు.ప్రజలకు కనిపించేది స్థానిక నాయకులు మాత్రమే.స్థానిక నాయకుల పనితీరు,వ్యవహార శైలి మాత్రమే ప్రజలకు కనిపిస్తుంది.ఇక గ్రామ స్థాయి, మండల స్థాయి పనులు అవసరం ఉన్న జనం తమ అందుబాటులో ఉన్న చిన్న నాయకుల వద్దకు వెళతారు. అధికార పార్టీ అండదండలతో తమ ప్రయోజనాలు సాధించుకోవాలని స్వార్థ పరులు ప్రయత్నిస్తారు.ఈ విషయాల పట్ల అవగాహన లేని క్రింది స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీకి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తున్నారు.అధికారం మత్తులోకి జారిన కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు రెచ్చిపోతున్నారని జనంలో అపవాదులు ఏర్పడ్డాయి.గ్రామ స్థాయి ప్రజలకు రెవెన్యూ,పోలీస్,పంచాయతీ రాజ్ శాఖలతో తక్షణ అవసరాలుంటాయి.తమ పనుల కొరకు వస్తున్న స్వార్థ పరుల కుయుక్తిని గమనించడం కార్యకర్తల భాధ్యత.రాక రాక వచ్చిన అధికారంతో సంయమనం కోల్పోయి కాంగ్రెస్ స్థానిక నాయకులు రెచ్చిపోయి అధికారులను శాసించాలని ప్రయత్నం చేస్తూ చెడ్డ పేరు మూటగట్టుకుంటున్నారు.గ్రామస్థాయిలో ప్రజా సమస్యల విషయాల పట్ల అవగాహన లేకుండా, తాము చెప్పిన పని జరగాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.ముఖ్యంగా రెవెన్యూ,పోలీసు అధికారులు కాంగ్రెస్ స్థానిక నాయకత్వాల ఒత్తిడి భరించలేక తలలు పట్టుకుంటున్నారు.ఔచిత్యం లేని పైరవీలతో తిమ్మిని బమ్మి చేసి కాంగ్రెస్ నాయకులు జనంలో బద్నాం అవుతున్నారన్న చెడ్డపేరు సంపాదించుకుంటున్నారు.తమ వద్దకు వచ్చిన వారి చెడు ఉద్దేశ్యాలు గమనించడంలో విఫలమవుతున్నారు.లేక లేక దక్కిన అధికారంతో వెంటనే లాభపడాలన్న ధోరణితో కాంగ్రెస్ నాయకులు స్థానిక వైరాలు పెంచుకుంటున్నారు.ప్రతి పనికి కేవలం పోలీసులను ఆశ్రయిస్తున్నారు.సివిల్ విషయాల్లో పోలీసుల సహకారంతో లాభ పడాలని కాంగ్రెస్ క్యాడర్ పొద్దున లేచిన దగ్గరినుండి స్టేషన్ చుట్టూ తిరగడం రాజకీయం అనే భ్రమలో ఉన్నారు.ప్రతి పనికి సంబంధించిన ప్రభుత్వ శాఖలుంటాయి. ఏ డిపార్ట్ మెంట్ పని ఆ డిపార్ట్ మెట్ చేయాలి. కానీ, ప్రతి పనికి పోలీసుల జోక్యం వల్ల అమాయక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.ఇది తమ పని కాదని తెలిసినా పోలీస్ అధికారులు అయిష్టంగా కాంగ్రెస్ నాయకుల మాటలు విని సివిల్ విషయాల్లో తలదూర్చుతున్నారు.దీనివల్ల తక్షణం బద్నాం అయ్యేది పోలీసులు.సామాన్యులు పోలీసుల పిలుపు కాదని ఎదురు తిరగక పోవచ్చు,కానీ చట్టం న్యాయం కోర్టులు అంటూ ఒక వ్యవస్థ ఉంది.వెనకా ముందు అసలు సమస్య న్యాయ శాఖ పరిధికి వెళ్ళక తప్పదు.మేము పిలిస్తే రావాల్సిందే అన్న పోలీసుల అహంకార వైఖరి కూడా కాంగ్రెస్ పార్టీకే నష్టం కలిగిస్తుంది.అధికారంలో బి.ఆర్.ఎస్ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా ప్రజల అభిప్రాయాన్ని గమనించకపోతే దెబ్బతినడం ఖాయం.కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పూర్తిగా అధికార మత్తులో మునిగిపోయింది. రెవెన్యూ పోలీసు డిపార్ట్ మెంట్ సహకారంతో ఏమైనా చేయవచ్చు అనుకోవడం వల్ల నష్ట పోవడం ఖాయం.అన్ని డిపార్ట్ మెంట్ సమస్యలు చివరికి కోర్టు పరిధిలోనికే వస్తాయి. చట్టం ముందు అందరూ సమానమే. అధికులమని భావిస్తే, అసలు స్థానం ఏమిటో చట్టం చెబుతుంది. ప్రభుత్వం కూడా చట్టానికి కోర్టులకు జవాబు చెప్పాల్సి ఉంటుంది.నిన్నటి వరకు ఊసులో లేని చిన్న చిన్న నాయకులు మా పార్టీ అధికారంలో ఉంది కాబట్టి, మేము ఏమి చేసినా చెల్లుతుంది అని భావిస్తున్నారు.ముఖ్యంగా భూ వివాదాలను రెవెన్యూ పరిధి దాటించి, పోలీసులను మేనేజ్ చేసి, ఎదుటి వారిపై ఒత్తిడి కలిగించి లాభపడాలని చూసే వారికి తత్వం భోధపడడం ఖాయం.మేడ్చల్ మండల పరిధిలో కొందరు నాయకులు ఒక గ్రూపుగా ఏర్పడి పంచాయతీలు చెయ్యడం కార్యక్రమంగా పెట్టుకున్నారని బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.అవి నిజం కూడా. నిన్నటి వరకు మట్టిలో మెదలాడిన వానపాములు,ఇప్పుడు నాగు పాముల మాదిరిగా బుసలు కొడుతున్నాయని అందరూ భావిస్తున్నారు.ఈ ధోరణి అధికార పార్టీ నాయకత్వం ఎంత తొందరగా గమనిస్తే అంత మంచిది.అధికారం అనేది ప్రజా సేవకు ఒక అవకాశం.ఆ అధికారాన్ని స్వార్థానికి, దమన నీతికి ఉపయోగిస్తే నష్టం ఖాయం.ఏ పార్టీ అయినా ఈ విషయం గమనించాల్సిందే.అన్ని పార్టీలకు ఇదే సూత్రం వర్తిస్తుంది.అధికారం సంపాదించిన కొద్ది కాలంలోనే కాంగ్రెస్ క్యాడర్ అతిగా వ్యవహరిస్తున్న తీరు పట్ల జనం అసంతృప్తి మొదలయ్యిందని విశ్లేషకుల అభిప్రాయం.ఇంటి లక్షణం వాకిలి చెబుతుంది అని ఒక సామెత ఎంత సత్యమో..ఒక పార్టీ ప్రభుత్వ పాలన తీరు కార్యకర్తలు చెబుతారు..అన్నది అంతే నిజం..కాంగ్రెస్ ప్రభుత్వ భవిష్యత్తు..గ్రామ మండల స్థాయి కార్యకర్తల చేతుల్లో ఉందన్న విషయం గమనించి, కాంగ్రెస్ అధినాయకత్వం దుందుడుకు నాయకులను కట్టడి చేయకపోతే మొదటికే మోసం వస్తుంది అని రాజకీయ పండితులు అభిప్రాయం.

# కుంభమేళ ఒక విశ్వ వేడుక నేను సైతం వేద ఘోషకు ఒక గొంతుకనయ్యాను

**రంజిత్ కుమార్ వాసం..ప్రయాగ నుండి**

నిన్న కుంభమేళ చివరి రోజు, శివరాత్రి పర్వ దినం. ప్రయాగ్ రాజ్ త్రివేణీ సంగమం లో బ్రహ్మ ముహూర్తంలో పుణ్య స్నానం చేసే అదృష్టం నాకు దొరికింది.ఆస్ట్రేలియాలో నివసిస్తున్న నేను ప్రయాగ్ రాజ్ పూర్ణ కుంభమేళ సమయంలో భారత్ కు రావడం గంగా యమునా సరస్వతీ నదుల త్రివేణీ సంగమంలో మునక వేయడం నా అదృష్టం.నేను సోషల్ మీడియాలో చూసిన కుంభమేళ వ్యతిరేక ప్రచారం అంతా ఒక ట్రాష్ అని అర్థం చేసుకున్నాను.ఫ్యాన్ క్రింద, ఏసీ రూముల్లో కూర్చుని కుంభమేళ పై విమర్శలు చేసిన వారి పోస్టులు చూసాను.కుంభమేళ తో నీళ్ళు కలుషితం అవుతాయని, రోగాలు ప్రభలుతాయని,ఇంత మంది జనాన్ని ఇలా రప్పించడం అవసరం లేదని, కాలి నడకన ప్రజలను నడిపించేలా ప్రోత్సహించడం తప్పని కూసిన కూతలు తప్పు అని నాకు అర్థం అయ్యింది.ఈ విమర్శలు చేసిన వారు కుంభమేళాకు వచ్చి చూస్తే అసలు విషయం అర్థం అవుతుంది.కాలి నడకన కిలో మీటర్ల కు కిలో మీటర్లు నడచి వస్తున్న శ్రద్ధాలువులతో మాట్లాడితే అర్థం అవుతుంది.ఇష్టపడి,కష్టపడి దైవ అనుగ్రహం కోసం,,ప్రకృతి ప్రేమ కోసం,దయ కోసం తపించి నడచి వస్తున్న సనాతనుల సంకల్పం చూస్తే అర్థమవుతుంది.శరీర సుఖాల కోసం చేసేవి విహార యాత్రలు.శరీరాన్ని భాదకు గురిచేసి, దైవ అనుగ్రహం కోసం కష్టాలు అనుభవించడం,ఆత్మను పునీతం చేసుకోవడం తీర్థ యాత్ర అవుతుంది.కుంభమేళ కూడా ఒక తీర్థ యాత్ర.ఇందులో కష్టం అసలే లేదు.ఈ కుంభమేళ ఒక యుగ విశేషం. 12 సం.లకు ఒకసారి వచ్చేది పుష్కర కుంభమేళా. అలా 12 పుష్కరాలు పూర్తయితే వచ్చేది పూర్ణ మహా కుంభమేళ.144 సం.లు పూర్తయిన ఈ పూర్ణ కుంభమేళ సమయంలో




జీవించి ఉండడం మన అదృష్టం. గత పూర్ణ కుంభమేళ 144 సం. క్రితం వచ్చింది.అప్పుడు మనం పుట్టలేదు. మళ్ళీ 144 సం.ల తర్వాత రాబోయే పూర్ణ కుంభమేళా వరకు మనం జీవించి ఉండం.ఈ అద్భుత అవకాశాన్ని దక్కించుకోవాలని 66 కోట్ల మంది పుణ్య స్నానాలకు రావడం ఈ యుగ అద్భుతం.

ఈ విశ్వాసాన్ని ఎగతాళి చేసిన వారు సనాతన హిందూ ధర్మ విరోధులు కాక ఇంకేమవుతారు? నేను నివసిస్తున్న ఆస్ట్రేలియా దేశ జనాభా కేవలం 2 కోట్ల 75 లక్షలు.అంటే 24 ఆస్ట్రేలియాలు కలిస్తే 66 కోట్ల జనాభా అవుతుంది.అమెరికా జనాభా 34 కోట్లు.అంటే రెండు అమెరికాలు కలిస్తే ఒక కుంభమేళా కు సమానమవుతుంది.ఇది నేను చూసిన కనీ వినీ ఎరుగని ఒక అద్భుతం.ఇది నా సనాతన హిందూ ధర్మంలోనే సాధ్యమైన గొప్ప వేడుక.తండోపతండాలుగా తరలి వచ్చిన హిందువులు క్రమశిక్షణతో ఐకమత్యంతో



లోకానికి తమ సహన శక్తిని చాటారు.హిందువులు తమ విశ్వ జనీన భావాన్ని లోకానికి చాటి చెప్పారు.ఇక్కడ ఎవ్వరిది ఏ కులంమో తెలియదు.ఎవ్వరిది ఏ మతమో తెలియదు.ఎవ్వరిది ఏ ప్రాంతమో తెలియదు.ఎవ్వరిది ఏ దేశమో తెలియదు.అంతా ఒక్కటిగా మారిన వసుదైక కుటుంబం ఈ కుంభమేళ.ఏకాత్మ భావనకు ప్రతిరూపం ఈ కుంభమేళ.ఈ మహా కుంభమేళ ఎవ్వరికి ఏమి కావాలో అది ఇచ్చింది.పేదలకు జీవనోపాధి దొరికింది.ధనవంతులకు వ్యాపారం దొరికింది.శ్రద్ధాలువులకు పరిశుభ్రమైన వ్యవస్థ దొరికింది.సద్భావన ఉన్న వారికి కుల మత రహిత సమాజం దొరికింది.భక్తులకు భగవంతుడు దొరికాడు.ఈ సనాతన సంగమం ఎవరికి ఏది కావాలో అది ఇచ్చింది.మలిన హృదయం ఉన్నవాళ్లకు మురికి దొరికింది.గద్దలకు శవాలు దొరికాయి.సనాతన ధర్మం ఎంత గొప్పదో నాకు తెలిసి వచ్చింది.ఎవరికి ఏది కావాలో అది ఇచ్చింది సనాతన హైందవం.ఎవరి స్వభావాన్ని బట్టి వారికి అదే దొరికింది.యాద్భావం తద్భవతి.ఇది మన ధర్మం గొప్పదనం.అందరినీ ప్రేమించేది నా సనాతన ధర్మం అని నాకు తెలిసొచ్చింది.ఈ ధర్మంలో పుట్టడం నా అదృష్టం.కుంభమేళ పుణ్య స్నానం చేసిన 66 కోట్ల మందిలో నేను ఒక్కడిని..ఈ జగమే నా కుటుంబం అనే భావన నాకు బలంగా తెలిసొచ్చింది..సనాతన హిందూ ధర్మ వేద ఘోష విశ్వమంతా వినిపించింది.ఆ శాంతి నాదాలలో నాది ఒక గొంతు. జై సనాతన హైందవం.భారత్ మాతాకీ జై.

## ఆర్థిక సహాయం అందజేసిన బిజెపి నాయకులు



**గజ్వేల్ ఫిబ్రవరి 26, కరపత్రం**

కోన్ని రోజుల క్రితం గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోని మరణించిన బండారు రవి కుటుంబం ను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన బిజెపి రాష్ట్ర నాయకులు మాదడి జశ్వంత్ రెడ్డి, మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పంజాల వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,భీం కూమర్,శాతం స్వామి, నరసింహ రెడ్డి,కూమర్ గౌడ్,లక్ష్మణ్ రెడ్డి వినోద్ కుమార్,మణికంఠ ,భాను,మహేష్, మల్లేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

## శివాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన వంటేరు ప్రతాప్ రెడ్డి

**గజ్వేల్ ఫిబ్రవరి 26, కరపత్రం**



మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ప్రజ్ఞాపూర్ పార్టీవేశ్వర శివాలయం లో ప్రత్యేక పూజలు చేసి గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రజ్ఞాపూర్ శివాలయం కు ప్రతి ఏడాది వచ్చి ఆ మహా దేవుడికి పూజలు చేస్తూ దర్శించుకోవడం జరుగుతున్నారు.ఇక్కడ పుట్టు లింగం ఉండడం మరియు ప్రజ్ఞాపూర్ పాండవులు వచ్చి మర్రి చెట్టుకింద సేదతీరడం దానిని ఇప్పటికి పాండవుల మర్రి కూడా అని పురాణాలూ పెద్దలు చెప్తూ ఉంటాయని వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు కార్యక్రమంలో సీనియర్ నాయకులు మర్కంటి కనకయ్య గుంటుకు రాజు ముదిరాజ్ మన్నే వెంకటేష్ ఎలా వెంకటేష్ ఎక్కలుదేవ్ కనకయ్య అందారి రమేష్ తుమ్మశ్రీను తుమ్మ నర్సింలు కుర్రే మహేందర్ రెడ్డి కర్ణాకర్ రెడ్డి, తుమ్మ ఉపేందర్, ఇంకా తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ నాయకులు వీరయ్య గౌడ్ అంతిమయాత్రలో పాడే మోసిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 26.**



వీణవంక మండలం ఏలుబాక గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లగొని వీరయ్య గౌడ్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందడంతో అ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వీరయ్య గౌడ్ అంతిమయాత్రలో పాల్గొని పాడమోసి,కష్టపడ్డ కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించి, మనో ధైర్యాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు చింతల శ్యామ్ సుందర్ రెడ్డి,మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు సురేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండేటి మహేష్,మండల అనిల్ రెడ్డి, తాళ్లపెల్లి తిరుమలేష్, నల్లగోని సతీష్, ఉమ్మడి సందీప్,రంజిత్ రెడ్డి, శ్రీకాంత్, బొంకూరి కుమార్, పంజాల అరవింద్,సుమన్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్రెడ్ ప్యాకెట్ లు పంపిణీ

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 26.**



లక్కారం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ,రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా 30మందికి ఆపరేషన్ జరిపించి ఉచిత బస్ రవాణా కల్పించి ఈరోజు
లక్కారం గ్రామానికి తీసుకెళ్తుండగా కల్వచర్ల గ్రామం వద్ద కలిసారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్,డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి వారిని పలకరిస్తూ ఆపరేషన్ జరిగిన విధానాన్ని,యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఆపరేషన్ చేయించుకున్న వారికి లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బు కేశవరెడ్డి బ్రెడ్ ప్యాకెట్స్ అందజేశారు.అనంతరం ఆపరేషన్ చేయించుకున్న వారు,వారి కుటుంబ సభ్యులు అన్ని వసతులు ఉచితంగా కల్పించి కంటి ఆపరేషన్ చేయించిన లయన్స్ క్లబ్ సభ్యులకు,రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణు మూర్తి,వైస్ చైర్మన్ చిదుర సురేష్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముతారం మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి,లయన్స్ క్లబ్ సభ్యులు ఆసం తిరుపతి,పరంకుశం శ్రీనివాస చారి,తీగల శ్రీధర్,మాజీ ఎంపీటీసీ మెట్టు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

**కరపత్రం: రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 26**



రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామంలో పురాతన శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని ఉమామహేశ్వర కళ్యాణం కమనీయం, శివోహం. శివరాత్రి సందర్భంగా బుధవారం రోజు శివపార్వతుల కళ్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు.ఆలయ కమిటీ భక్తులతో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించారు.ఈ కార్యక్రమంలో కొలిపాక సత్తయ్య, మాజీ జెడ్పిటిసి గంటా వెంకట రమణారెడ్డి,వీరగోని శ్రీనివాస్,కొలిపాక సారయ్య, కొప్పుల సునీల్, బురుగు రాజు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆర్.వి.ఎం.బి.పీ క్రికెట్ కప్ సీసన్ -02 ప్రారంభం

**కరపత్రం బెజ్జంకి**



బెజ్జంకి మండల కేంద్రములో ఆర్.వి.ఎం.బి.పీ కప్ సీసన్ -02 బుధవారం ప్రారంభించడం జరిగింది.బెజ్జంకి మండల కేంద్రములో అకాడమీ స్థాపననే ధ్యేయంగా, అండర్ 14, 19 క్రికెట్ క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు ఆర్.వి.ఎం.బి.పీ సీసన్ -01లో ప్రథమ బహుమతి ట్రోఫీ మరియు 50వేల నగదు, ద్వితీయ బహుమతి ట్రోఫీ 25వేల నగదు ఇవ్వడం జరిగింది.. సీజన్ -02 లో ప్రథమ బహుమతి ట్రోఫీ లక్ష నగదు, ద్వితీయ బహుమతి ట్రోఫీ 50వేల నగదు. గ్రేస్ బాల్ , ఓపెన్ టూ అల్ విధానములో రాష్ట్రస్థాయి కప్ గా సన్నాహక మ్యాచ్ తో ప్రారంభమైనది..ఎంట్రీ ఫీజ్ 6000/- మొదటి దశలో లీగ్స్ సుమారు 60టీంలు పాల్గొంటాయి. అనంతరం గ్రూప్స్ డ్రా ద్వారా టోర్నీ నిర్వహణ జరుగుతుంది


ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సభ్యులు మానాల రవి, సంగేమ్ మధు, దోనె వెంకటేశ్వర రావు, దొంతరవేణి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గుండ్ల పోచంపల్లి యువత

**- ముఖ్య అతిథి సింగిరెడ్డి హరవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతి ప్రధానం**
**- జి. రవి ముదిరాజ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్**

**" కరుణాకర్ మల్లిగారి,కరపత్రం మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి "**





మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రాజీవ్ గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తనయుడు సింగిరెడ్డి ప్రణయ్ వర్ధన్ రెడ్డి హాజరైనారు, ఇటీవల నిర్వహించిన రాజీవ్ గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ గువ్వ రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో వారు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ లో మొదటి విజేతగా గుండ్ల పోచంపల్లి యువత అలాగే రెండో విజేతగా గౌడవెల్లి యువత నిలవడం జరిగింది మొదటి విజేతలకు బహుమతిగా మనీ రూ:50,000.రెండో విజేతలకు బహుమతిగా 20,000 రూపాయల నగదును అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి హాజరై క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీలను విజేతలకు అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో ప్రణయ్ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి క్రీడలు నిర్వహించి ప్రతి ఒక్క యువతకు ప్రోత్సహించే విధంగా క్రికెట్ టోర్నమెంట్ ని తీసుకొని యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవడం గొప్ప విషయమని తెలియజేశారు, ఈ యొక్క టోర్నమెంట్ ని నడిపిన గువ్వ రవి ముదిరాజ్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేయడం జరిగింది,ఈ యొక్క కార్యక్రమానికి సింగిరెడ్డి ప్రణయ్ వర్ధన్ రెడ్డి తో పాటు గుండ్లపోచంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, రాష్ట్ర సర్పంచుల ఫోరం అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్ మేడ్చల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ, మాజీ ఐ.ఎన్.టి.యు.సి. శేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివ శంకర్ గుండ్ల పోచంపల్లి మున్సిపల్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ కౌడా మహేష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు శేఖర్ ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్ వినోద్ గౌడ్ మోహన్ రెడ్డి మున్సిపల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్ ముదిరాజ్, దొడ్ల మోహన్,సాగరబోయిన మల్లేష్, వినోద్ గౌడ్, భాస్కర్,గుండ్లపోచంపల్లి ఓబీసీ అధక్షులు విజయ్ ముదిరాజ్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## శివ నామ స్మరణతో మారుమోగిన శంకరపట్నం...

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, భక్తజన కోటి...**

**కరపత్రం: శంకరపట్నం ఫిబ్రవరి 26**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకున అన్ని గ్రామాల్లో శివ నామస్మరణతో భక్తజన కోటి ప్రత్యేక పూజలు బుధవారం అంగరంగ వైభవంగా కన్నుల పండుగ వలె ఆలయాల్లో ఎక్కువ జాము నుండి నిర్వహించారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చింతల పల్లె గ్రామంలో గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కమ్మంపల్లి సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల పూజారులు మాట్లాడారు. వేకువ జామున నిద్ర లేచి, నివాస గృహాలను శుద్ధి చేసుకుని శివపార్వతుల కళ్యాణం పేరుమీద ఉపవాస దీక్ష, జాగరణ చేపట్టడం జరుగుతుందని, బుధవారం శివ పార్వతుల కళ్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో నిర్వహించడం జరుగుతుందని, శివపార్వతుల భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి కళ్యాణానికి హాజరై బుధవారం రాత్రి జాగరణ, నిద్ర చేయకుండ, శివపార్వతుల నామస్మరణతో గురువారం వరకు మేల్కొని ఉండి, వేకువ జాము నుండి శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు సమర్పించి ఉపవాస దీక్షను విరమించడం జరుగుతుందని పూజారులు తెలిపారు. కొత్తగట్టు మచ్చ గిరింద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో గొల్యాల గంగాధర్ స్వామి పూజారి ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిగుండం కార్యక్రమానికి వేకువ జామున్నే భక్తకోటి జనం హాజరై అగ్ని ప్రవేశం చేసి, భక్తిని చాటుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు, మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బసవయ్య గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, శ్రీ మత్స్య గిరింద్ర స్వామి ఆలయ చైర్మన్ ఉప్పుగల్లు మల్లారెడ్డి, ధర్మకర్తలు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆడెపు అజయ్, భక్త కోటి జనం, ఆయా గ్రామాల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు ,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వీణవంక లో శివస్మరణతో మారుమోగిన శైవ క్షేత్రాలు..

**- ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న వీణవంక శివాలయం..**
**- దర్శనానికి బారులు తీరిన భక్తులు..**

**కరపత్రం: ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 26.**



వీణవంక మండలంలోని శివాలయంలో శివరాత్రి పర్వదినానంగా సందర్భంగా ఉదయం నుండి మధ్యాహ్నం వరకు భక్తులు దర్శనానికి బారులు తీరారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గూడ జగదీశ్వర శర్మ ఆధ్వర్యంలో గోపూజ, సామూహిక రుద్రాభిషేకాలు ఆధ్యాత్మిక శోభను విరిజిల్లెల, భక్తులు ఓం నమశ్శివాయ అంటూ పంచక్షర మంత్రాన్ని స్మరిస్తూ, మహాదేవుని అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగిన ప్రత్యేక భజన కార్యక్రమంలో భక్తి పాటలతో, భక్తులు భక్తి పరవశంలో మునిగిపోయి, మహాదేవుని స్మరిస్తూ, ఆత్మసాక్షాత్కారాన్ని పొందారు .వీణవంక ఆలయ చైర్మన్ రామిడి శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో ఆటంకం కలగకుండా, భక్తులకు దర్శనానంతరం నైవేద్యాలను అందజేస్తూ, భక్తుల సహాయార్థం దేవాలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాల అలంకరణ, త్రాగునీరు, సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినందుకుగాను, ఆలయ చైర్మన్ భక్తుల ప్రశంసలు పొందుతున్నారు. అలాగే మండలంలోని మామిడాలపల్లి, శ్రీరాముల పేట, నర్సింగాపూర్, రెడ్డిపల్లి, చల్లూరు, మల్లారెడ్డిపల్లి గ్రామాలలో శివరాత్రి పర్వదినాన అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేస్తూ , ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, శివ ఆలయాన్ని దర్శించి, మహాదేవుని అనుగ్రహాన్ని పొందారు.

## నేడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి (సిరియల్ నె -2) మీ మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారిమెజార్టితో గెలిపించాలి.

**- తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్**

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 26.**



రామగిరి మండలం గ్రామాలలో ఉన్న 1278 పట్టభద్రులను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించవల్సిందిగా కోరుతున్న తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు బలపరిచిన అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి వూటుకూరు సీరియల్ నెంబర్ 2 పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించగలరని తెలిపారు. యువ నాయకులు దుద్దిల్ల శ్రీను బాబు సూచనలతో ముందుకు వెళ్తున్నామని పట్టభద్రులను అందరినీ కలిసి నేడు జరగనున్న పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లో ప్రతి ఒక్క పట్టభద్రుని మన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించే దిశగా రామగిరి మండలం యువజన కాంగ్రెస్ నాయకులు ముందు ఉండాలని కోరుతున్నాము.